క్లుప్తంగా

16,700 డస్ట్ బిన్‌ల సరఫరా



మండల కేంద్రానికి చేరుకున్న చెత్త సేకరణ బుట్టలు

చీపురుపల్లి: తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇళ్లకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందించేందుకు వీలుగా గ్రామాల్లో ప్రతీ ఇంటికి ప్రభుత్వం డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తోంది. తాజాగా మండలానికి 16,700 చెత్త సేకరణ బుట్టలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఇవి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిని మండలంలోని 19 పంచాయతీలకు సరఫరా చేయనున్నారు. ప్రతీ ఇంటికి రెండు బుట్టల చొప్పున పంపిణీ చేయాల్సి ఉంది.

నియామకపత్రం అందజేత



వలంటీర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఖాళీ అయిన గ్రామ వలంటీర్ పోస్టును అధికారులు భర్తీ చేశారు. ఇంటర్వ్యూలో ఎంపికైన కె.ప్రశాంతికి ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్ సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈఓపీఆర్డీ సీహెచ్.సుగుణాకరరావు, కొత్తపాలెం వైఎస్సార్‌సీపీ నాయకుడు వేమలి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మేనేజర్‌కు సన్మానం



ఉద్యోగులను సత్కరిస్తున్న రైల్వే ఉద్యోగులు

చీపురుపల్లి: స్థానిక రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించి కోరుకొండ రైల్వేస్టేషన్‌కు బదిలీ అయిన పి.రాజాబాబు ఆత్మీయ వీడ్కోలు సభను స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం నిర్వహించారు. రాజాబాబుతో పాటు ఆయన స్థానంలో సీతానగరం నుంచి బదిలీపై ఇక్కడి వచ్చిన వై.కోటేశ్వరరావును సిబ్బంది ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం, చీపురుపల్లి స్టేషన్ మాస్టర్లు ఏ.వి.రమణ, మురళీకృష్ణ, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిగ్నల్ మెంటైనర్ వి.రాజేష్, సిబ్బంది రెడ్డి నీలకంఠం, ఎం.గోపీనాథ్, బి.శ్రీను, ఏ.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణపనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అర్జునమ్మ

వేపాడ: మండల కేంద్రంలోని రామాలయం వీధిలో రూ.2లక్షలతో సోమవారం సీసీ రోడ్డు నిర్మించారు. సర్పంచ్ మిరపాక అర్జునమ్మ మాట్లాడుతూ పంచాయతీ నిధులతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని తెలిపారు.

మొక్కల పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ పెద్దఅప్పలనాయుడు

మెరకముడిదాం: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ఊటపల్లి, కొమ్మానివలస గ్రామాల రోడ్డుకు ఇరువైపులా ఇటీవల నాటిన మొక్కలను ఉపాధి హామీ ఏపీఓ ఎస్.పెద్దఅప్పలనాయుడు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ నాటిన 600 మొక్కల్లో ఒక్కమొక్క కూడా చనిపోకుండా పెంచాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ ఎల్లయ్య, క్షేత్రసహాయకుడు పాల్గొన్నారు.

అదనపు బస్సు సౌకర్యం కల్పించాలి

చీపురుపల్లి: మెరకముడిదాం– చీపురుపల్లి మధ్య విద్యార్థుల కోసం అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రతినిధి వెంకటేష్, మండల అధ్యక్షుడు వంశీ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఒకే బస్సు ఉండడంతో విద్యార్థుల్లో కొంతమందికే సరిపోతోందని, చాలామంది కళాశాలలకు వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. ఉన్న ఒక్క బస్సు సర్వీసు కూడా పలుమార్లు ఆలస్యంగా వస్తుండడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి చీపురుపల్లి నుంచి మెరకముడిదాం వరకు అదనపు బస్సు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం



విజయం సాధించిన వారితో కలిసి విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

• ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, ఇటీవల రాష్ట్రంలో జరిగిన పంచాయతీల ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఏకపక్ష విజయాలే అందుకు నిదర్శనమని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. విజయం సాధించిన అభ్యర్థులతో కలిసి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందన్నారు. ఆయన పరిపాలనను మెచ్చి పంచాయతీ ఉపఎన్నికల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను గెలిపించారని అన్నారు. ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఆరు సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా వీటిలో ఒకటి వైఎస్సా ర్‌సీపీ మద్దతుదారు ఏకగ్రీవంగా గెలుచుకోగా, మిగతా అయిదు స్థానాల్లో నాలుగు చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. వార్డు మెంబర్ల ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే అధికశాతం గెలిచారన్నారు. ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగిస్తే, ఎల్లోమీడియా, కొన్ని పత్రికలు మాత్రం టీడీపీ హవా అని తప్పుడు కథనాలు, రాతలు రాయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గెలిచే సత్తా లేక టీడీపీ నాయకులు టీవీ ఛానెళ్లు, పేపర్లను అడ్డం పెట్టుకొని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గం కుప్పంలో ఆరు స్థానాల్లో వార్డు మెంబర్ స్థానాలకు పోటీ జరగగా, అయిదు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారని,ఇది సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలకు ఉన్న నమ్మకమని అ న్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారాయణమూర్తిరాజు, జెడ్పీటీసీ గార తవుడు, మండ ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, పార్టీ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కనకల సుబ్రహ్మణ్యం, మంత్రి అప్పలనాయుడు, బైరెడ్డి శ్రీను, సామంతుల పైడిరాజు, రేగ సురేష్, కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



మహిళకు పథకాలను వివరిస్తున్న నాయకులు

గుర్ల: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని మణ్యపురిపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్నామని, సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, బోళ్ల సుబ్రహ్మణ్యం, బడుగంటి వెంకటరమణ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన'అర్జీలకు త్వరితగతిన పరిష్కారం



బొండపల్లి: వినతులు స్వీకరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, అధికారులు



మెరకముడిదాం: స్పందనకు హాజరైన అధికారులు

బొండపల్లి: 'స్పందన'లో ప్రజలు అందించే అర్జీలను పరిశీలించి అవకాశం ఉన్నవాటిని త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. మూడు అర్జీలు స్వీకరించారు. వాటిని నిర్దిష్ట వ్యవధిలోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, ఎంఈఓ–2 అల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతీ సమస్యకు పరిష్కారం

గజపతినగరం: ప్రజల ప్రతీ సమస్యకు స్పందనలో పరిష్కారం లభిస్తుందని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం (స్పందన)కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తక్షణం పరిష్కరించాలి

మెరకముడిదాం: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీఓ ఎం.రత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు.

మైదానం అభివృద్ధికి ప్రతిపాదనలు



మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, తదితరులు

వేపాడ: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని మైదానం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కూర్మనాథ్ పట్నాయక్ తెలిపారు. మైదానాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. మైదానా న్ని చదును చేయడంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేయాలని పంచాయతీరాజ్ ఏఈ మహ్మద్‌ఆలీని ఆదేశించారు. గురుకుల పాఠశాలతో పాటు, కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు ఆటలు ఆడుకునేందుకు వీలుగా ఈ మైదానం అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఇంటి వద్దే మెరుగైన వైద్యం



దత్తిరాజేరు: దాసరిపేటలో చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

గజపతినగరం/ దత్తిరాజేరు: 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యసేవలు లభిస్తున్నాయని మరుపల్లి, దత్తిరాజేరు పీహెచ్‌సీల వైద్యాధికా రులు అనూజ్‌రాయ్, సతీష్‌కుమార్ తెలిపారు. గజపతినగరం మండలం రామన్నపేట, దత్తిరాజేరు మండలంలోని దాసరిపేట గ్రామాల్లో సోమవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో రామన్నపేటలో 88 మందికి, దాసరిపేటలో 54 మందికి వైద్యసిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి దీర్ఘకాలిక వ్యాధులతో మంచాలపై ఉన్న రోగులకు వైద్యతనిఖీలు చేశారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

నేడు 'గడప గడపకు మనప్రభుత్వం' 250వ రోజు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 250వ రోజు కావడంతో కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మ కంగా నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ చంద్రశేఖర్

కొత్తవలస: స్థానిక మూడురోడ్ల జంక్షన్‌లో సీఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ అరకు నుంచి గంజాయి తరలించే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సహాయం

చీపురుపల్లి: పట్టణంలోని వంగపల్లిపేట గ్రామంలో దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న గొల్లబాబుకు విజయనగరానికి చెందిన మాతృభూమి సేవా సంఘం ప్రతినిధులు సోమవారం మందులు అందజేశారు. అలాగే హెల్పింగ్ హ్యాండ్ హిజ్రా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డి.కొండబాబు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం చేశారు.

రాజారావు సేవలు వెలకట్టలేనివి



రాజారావు విగ్రహానికి పూల మాలవేస్తున్న రామకృష్ణ

విజయనగరం ఫోర్ట్: ఎస్సీల సంక్షేమం, ఐక్యత కోసం పాకా రాజారావు నిరంతర శ్రమించారని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. దళిత నాయకుడు రాజారావు జయంతి సందర్భంగా రింగ్‌రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీల అభివృద్ధికి నిరంతరం పోరాటం చేశారన్నారు. అంబేడ్కర్ జంక్షన్‌లో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి ప్రభుత్వాన్ని ఒప్పించారని తెలిపారు. 200 అంబేడ్కర్ విగ్రహాల స్థాపనకు కృషి చేసారన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, శంకరరావు, పైడితల్లి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

• గోవులను రక్షించాలి



ఎస్పీ దీపికకు వినతిపత్రం అందజేస్తున్న గో సరంక్షణ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం క్రైమ్: గోమాతలకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘాల సమాఖ్య ప్రతినిధులు, అర్చక పురోహిత సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎస్పీ దీపికాపాటిల్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, కొండవెలగాడ వద్ద గోశాలను నిర్మించి, రోడ్లపై తిరుగుతున్న గోవులను తక్షణమే అక్కడకు తరలించాలని కోరారు. గోవధను నిషేధించినప్పటికీ ఇంకా అది నిరాటంకంగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పశువుల అక్రమ రవాణా, గోవధను నిరోధించేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే డీఆర్ఓ గణపతిరావుకు వినతి పత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు టీవీ.శ్రీనివాసరావు, భమిడిపాటి రామ్‌కుమార్, గన్నవరపు శ్రీనివాస్, మంత్రిప్రగడ రవికుమార్, కేజే శర్మ, అల్లంరాజు కామేశ్వర శర్మ, రామాయణం సత్యనారాయణ, బి.సన్యాసిరాజు, చామర్తి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



శృంగవరపుకోట: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

• ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు జాగ్రత్తలు సూచించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. కొట్టాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(పీహెచ్‌సీ)లో వైద్యాధికారి హారిక నేతృత్వంలో సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రఘురాజు ముందుగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, మందులు, వైద్య పరీక్షలు, 104 సేవలు, ఫ్యామిలీ డాక్టర్ సేవలపై ఆరా తీశారు. వైద్యసిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. వర్షాకాలంలో జలుబు, దగ్గు, జ్వరం, దోమల వల్ల సంక్రమించే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



చీపురుపల్లిరూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనరసమ్మ

మెరుగైన వైద్యసేవలందించాలి

చీపురుపల్లి రూరల్: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్యసిబ్బంది పనిచేస్తూ రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎంపీపీ, కర్లాం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. కర్లాం పీహెచ్‌సీలో అభివృద్ధి సలహా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. సాధారణ ప్రసవాలు జరగాలంటే ఎలాంటి వ్యాయామాలు చేయాలి, సిజేరియన్ వల్ల కలిగే నష్టాలను గర్భిణులకు వివరించాలన్నారు. ఆస్పత్రిలో మందులు పూర్తి స్థాయిలో అందుబా టులో ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తహసీల్దార్ ఎం.సురేష్, వైద్యాధికారులు సువర్ణ, శ్రీలక్ష్మి, అలజంగి సర్పంచ్ రఘుమండ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, పతివాడ రాజారావు, ఈఓ అప్పలనాయుడు, సీహెచ్ఓ కమలకుమారి, బాణాన రమణ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: వచ్చే నెల 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని న్యాయవాదులు, పోలీసులు విజయవంతం చేయాలని స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సివిల్ కోర్టు జూనియర్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. కోర్టులో సోమవారం న్యాయవాదులు, పోలీసులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాజీకాదగిన కేసుల ను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది చిన్నచిన్న విషయాలకు తగాదాలను పెంచుకొని కోర్టుల చుట్టూ, పోలీసుల చుట్టూ తిరుగుతూ కాలాన్ని, డబ్బును వృథా చేసుకుంటూ ఉంటారని, అటువంటి వారికి లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ఉంటుందని చెప్పాలని సూచించారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి



పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మెంటాడ మండలం కుంటినవలస గ్రామ సమీపంలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 25వ తేదీన శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే అప్పలనరయ్య తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నాయకులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన అనంతరం దత్తిరాజేరు మండలం మరడాం గ్రామంలో బహిరంగసభ ఉంటుందని, ఈ రెండు కార్యక్రమాలను నాయకులు సమష్టిగా విజయవంతం చేయాలని కోరారు. బహిరంగ సభకు నియోజకవర్గ పార్టీ నాయకులు, ప్రజలు తరలివచ్చేలా చూడాలని సూచించారు. గజపతినగరం, గంట్యాడ మండలాల జెడ్పీటీసీలు గార తవుడు, వర్రి నరసింహమూర్తి, గజపతినగరం,దత్తిరాజేరు,జామి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూడి వెంకటరావు, కడుబండి రమేష్ నాయుడు, గొర్లె రవి కుమార్, దత్తిరాజేరు ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, సీనియర్ నాయకులు నారాయణమూర్తిరాజు, మంత్రి అప్పలనాయుడు, బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, పి.రమేష్, కె.సుబ్రహ్మణ్యం, రేగ గోవింద,కర్రి నానాజీ, పి.సూర్యప్రకాశ్, గేదెల ఈశ్వరరావు, గిడిజాల కామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



హెచ్‌ఎంకు కుర్చీలు అందజేస్తున్న కళాశాల సాధన కమిటీ సభ్యులు

జామి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎనిమిదేళ్ల క్రితం కళాశాల సాధన కమిటీ కార్పస్‌ఫండ్ నిమి త్తం రూ.5.27లక్షలు సేకరించింది. వాటిని బ్యాంకులో డిపాజిట్ చేయగా, ఆమొత్తంపై వడ్డీ లక్ష రూపాయలు వచ్చింది. ఈ మొత్తాన్ని విద్యాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నిధుల్లో రూ.5 వేలుతో కుర్చీలు కొనుగోలు చేసి స్థానిక ఉన్నతపాఠశాలకు సోమవారం అందజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ పదోతర గతిలో ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు ఒకొక్కరికీ రూ.3 వేల చొప్పున ఇటీవల అందజేశామని చెప్పారు. తల్లిదండ్రులులేని 13 మంది విద్యార్థులకు రూ.2,500 చొప్పున రూ.32,500,పాఠశాలకు జిమ్ పరికరాలు , స్థానిక గ్రంథాలయ మరమ్మతులకు రూ.30 వేలు అందించినట్లు తెలిపారు. హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.